క్లుప్తంగా

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఈనెల 29న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆర్‌సీవో గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో 30 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. స్పాట్ కౌన్సెలింగ్ రోజు విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

వాహనాల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. వినాయక్ చౌక్‌లో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి, వాహనదారులతో పెండింగ్ చలాన్లు కట్టించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా మందుబాబులకు పరీక్షలు నిర్వహించి జరిమానా విధించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠినంగా చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఎస్సైలు హరిబాబు, అశోక్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో మజ్జిగ పంపిణీ

ఎదులాపురం: ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రిమ్స్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం ప్రజలకు కలిగించేందుకు ఏకేఎస్ సొసైటీ చైర్మన్ ఆదిత్య ఖండేష్కర్, మానవుని సేవే దేవుని సేవ సంస్థ చైర్మన్ సాయిని రవి రిమ్స్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు మజ్జిగ పంపిణీ చేశారు.

డబ్బులు అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి తీసుకోవడం మరిచిపోయిన మహిళకు టుటౌన్ సీఐ పురుషోత్తమ చారి శనివారం డబ్బులు అందజేశారు. ఈనెల 13న పట్టణంలోని కచారి బేకరీ వద్ద గల ఏటీఎంలో డబ్బులు తీసుకోవడానికి వెళ్లిన పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ఏటీఎం నుంచి డబ్బులు వచ్చి ఉన్నట్లు గుర్తించాడు. ఈవిషయాన్ని సీఐ సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న ఖమ్మం జిల్లాకు చెందిన శారద పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఆమెకు నగదు అందజేశారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన అబ్దుల్ రహమాన్ ఈనెల 26న మృతి చెందాడు. కాగా తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎంపీపీ తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఇర్ల అఖిల్‌లు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట సొసైటీ సభ్యులు సుధీర్‌రెడ్డి, మృణాల్, హరీశ్, గౌతమ్ రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

రమాబాయి వర్ధంతి

బోథ్: అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతిని మండలంలోని సొనాల గ్రామంలో శనివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అమృత్ పాటిల్, కార్యదర్శి మునేశ్వర్ సోమన్న, నేతకాని మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంబ్లే భీంరావ్, యశ్వంత్ రావ్, భూమ్‌రావ్, గణపతి, గంగాధర్ పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంతాల్లో డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం జారుబాయి అన్నారు. శనివారం మండలంలోని గుండి, గుండివాగు గ్రామాల్లో డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాగులు, నిల్వ ఉన్న వ్యవసాయ బావుల్లోని నీటిని తాగవద్దని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించాలి'


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎదులాపురం: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. శనివారం పట్టణంలోని మహాలక్ష్మీవాడలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని, కాంగ్రెస్ డిక్లరేషన్‌ను కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్ రెడ్డి, అంబకంటి అశోక్, నగేశ్, రూపేష్ రెడ్డి, ప్రభాకర్, నహిద్ పాల్గొన్నారు.



ఇద్దరికి ఉపాధినిస్తూ..

పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన సుగుణ స్వయం ఉపాధిని పొందడంతో పాటు మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తూ.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన ఆమె తొలుత టైలరింగ్ షాపును ఏర్పాటు చేశారు. మహిళలకు అవసరమైన రకరకాల డిజైన్లతో కూడిన దుస్తులను అందిస్తూ.. మంచి ఆదరణ పొందారు. బ్యాంకు నుంచి రుణం తీసుకుని వ్యాపారాన్ని విస్తరింపజేశారు. టైలరింగ్ షాపుతో పాటు చీరలను విక్రయిస్తూ.. ఆర్థికంగా ముందడుగు వేశారు.

స్వశక్తితో ముందుకు..

- స్వయం ఉపాధితో కుటుంబాలకు అండ
- పలువురికి ఉపాధి కల్పిస్తున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న మహిళలు

వారు నేర్చుకున్న ఉపాధి శిక్షణ మధ్యలోనే వదిలేయకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు మహిళలు. ఎంచుకున్న రంగంలో ఇష్టంగా పనిచేస్తూ.. స్వయం సమృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నారు. ప్రభుత్వం ఐకేపీ, మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే స్త్రీనిధి, బ్యాంకు రుణాలు వంటి ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకుని సొంతంగా వ్యాపారాలను ప్రారంభించారు. తమకిష్టమైన వృత్తిలో రాణిస్తూ.. వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. సొంతంగా తమ కాళ్లపై తాము నిలబడడంతో పాటు మరికొంత మంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళలు తలచుకుంటే ఏ రంగంలోనైనా ప్రగతి సాధిస్తారని నిరుపించారు. – కైలాస్‌నగర్

కష్టాలకు ఎదురీది..



ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహిళ పేరు ఎస్.సుజాత. 18 ఏళ్ల కిందట భర్త చనిపోయాడు. ఇద్దరు ఆడపిల్లలే. తన దుఃఖాన్ని దిగమింగుకుని టైలరింగ్‌లో శిక్షణ పొందారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష రుణాన్ని తీసుకుని సొంతంగా టైలరింగ్ దుకాణం ఏర్పాటు చేసుకుంది. ఇష్టమైన వృత్తిలో కష్టపడుతూ కుటుంబానికి అండగా నిలిచారు. పిల్లల భవిష్యతే లక్ష్యంగా ముందడుగు వేసి కుటుంబానికి అన్ని తానే అయ్యారు.

సరదాగా నేర్చుకున్న..



బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న మహిళ టీచర్స్‌కాలనీకి చెందిన బి.పూనమ్. సంతోషిమాత ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు. పెళ్లికి ముందు ఖాళీగా ఉండడం ఎందుకనీ బ్యూటీషియన్ కోర్సు నేర్చుకున్నారు. ఆ తర్వాత దానిపై ఆసక్తిని పెంచుకొని, అందులో పట్టుసాధించారు. పెళ్లయ్యాక తన భర్త సహకారంతో బ్యాంకు నుంచి రుణం తీసుకుని బ్యూటీపార్లర్ ప్రారంభించారు. ప్రస్తుతం స్వయం ఉపాధి పొందుతూ తన కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

ఇష్టంతో కష్టమైన పని



హోటల్ రంగంలో రాణించాలంటే కష్టంతో కూడుకున్న పని. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన శోభ. తన భర్త చనిపోవడంతో టైలరింగ్ షాపును నిర్వహిస్తూ.. కుటుంబాన్ని పోషించేది. హోటల్‌ను ఆమె కొడుకు నిర్వహించేవారు. దురదృష్టవశాత్తు ఆమె కొడుకు మరణించడంతో ఆమె స్వయంగా హోటల్‌ను నిర్వహిస్తోంది. గత ఆరేళ్లుగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలో హోటల్‌ను నిర్వహిస్తు తక్కువ ధరకే ప్రజలకు భోజనాన్ని అందిస్తున్నారు.

అభివృద్ధిలో దుసుకుపోతున్న నేరడిగొండ


మాట్లాడుతున్న ఎంపీపీ రాథోడ్ సజన్

నేరడిగొండ: నేరడిగొండ మండలం అభివృద్ధిలో దుసుకుపోతుందని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. శనివారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మాన్‌సింగ్ హాజరై మాట్లాడారు. ఏఎంసీ తరుపున రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారూ పండించిన పంటలు విక్రయించుకునేలా ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా మండల అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ప్రజలకు సేవ చేస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ సమద్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనానికి సందర్శించి, నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు పథకాలను అమలు చేయండంతో పాటు గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు విజయ, స్వర్ణలత పాల్గొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ చారులత రాథోడ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని నిర్వహించారు. జెడ్పీటీసీ చారులత రాథోడ్ హాజరై నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాగాపూర్ సర్పంచ్ సునీల్ జాదవ్, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ జావేద్, జావేద్, సతీశ్, విష్ణు, సోమనాథ్, అర్జున్ పాలొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నెహ్రూ దేశ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాహెద్, డెగాల భీమన్న, ముస్తాఫా, లక్ష్మణ్, బాబా, ప్రభాకర్ పాల్గొన్నారు.

సోయా సబ్సిడీ పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న కట్కం రాందాస్

జైనథ్: బీఆర్ఎస్ ప్రభుత్వం సోయా విత్తనాలపై సబ్సిడీ పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం సోయా విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేసేదని, ప్రస్తుతం ఎత్తివేయడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద బస్తాకు రూ. 4– 5 వేలు చెల్లించలేక రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రైతు బీమా, విత్తనాలపై సబ్సిడీ, రుణమాఫీ, వ్యవసాయ యంత్రాలపై సబ్సిడీ ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు కరుణాకర్ రెడ్డి, బింగి వెంకన్న, సురేశ్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, చాణిక్ రావ్, అశోక్ యాదవ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు లంపీస్కిన్ టీకాలు

జైనథ్: వెటర్నరీశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు గ్రామాల్లో లంపిస్కిన్ టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని నిరాలలో వెటర్నరీ వైద్యుడు వినోద్ దేశ్‌పాండే, స్థానిక నాయకులతో కలిసి టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కోల భోజన్న, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం'

ఎదులాపురం: ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ నివాసంలో శనివారం మాట్లాడారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పితే ఎమ్మెల్యే చేసింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు అంతా ఏకతాటిపైకి రావడం చూసి ఎమ్మెల్యేకు భయం పట్టుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి


మాట్లాడుతున్న సంగెం బొర్రన్న


ఇచ్చోడ: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. శనివారం ఇచ్చోడలో మాట్లాడారు. ఇటీవల కాలంలో జిల్లాలో నిషేధిత బీజీ 3 విత్తనాల విక్రయం జోరుగా సాగుతుందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేసి చేతులు దులుపు కుంటున్నారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తే నిషేధిత బీజీ 3 విత్తనాలు అరికట్టవచ్చన్నారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, గంగాధర్, కైలాస్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల వంటావార్పు


భోజనం చేస్తున్న వీవోఏలు

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీవోఏలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 41వ రోజుకు చేరింది. అయినా ప్రభుత్వం స్పందించడం లేదని నిరసిస్తూ వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సమ్మె శిబిరంలోనే సహపంక్తి భోజనాలు చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి



బోథ్ తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయాలని జెడ్పీటీసీ సంధ్యారాణి ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావును శనివారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిందన్నారు. నిరుద్యోగులు చదువుకునేందుకు నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. – బోథ్

ప్రతీవార్డులో అభివృద్ధి పనులు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్


పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పట్టణంలోని ప్రతీవార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని 40వ వార్డు సరస్వతినగర్ పరిధిలో జరుగుతున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. పనుల ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లుగా వెల్లడించారు. ఆయన వెంట వార్డ్ కౌన్సిలర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి


ఎదులాపురం: ఏర్పాట్లు పరిశీలిస్తున్న నజీర్ అహ్మద్

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో ఆదివారం ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం డైట్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిరాజ్ ఖద్రి, ఇనాయత్, మహ్మద్ రోహిత్, షానవజ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిరండి

బోథ్: విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ సభకు తరలిరావాలని రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. విశ్వబ్రాహ్మణులు ఆత్మగౌరవం కోసం, అభివృద్ధి కోసం, రాజకీయ భాగస్వామ్యం కోసం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి పాటు పడుతామని బోథ్ సర్పంచ్ సురేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిచెల్మ ప్రవీణ్ కుమార్, రవీందర్, శ్రీకర్, రంగు రాజు, రూపేష్ పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామ శివారులోని మూసా గార్డెన్‌లో నిర్వహించే సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బాపురావు అన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, మార్కెట్ చైర్మన్లతో పాటు బీఆర్ఎస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

ప్రజాగర్జన విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తాంసి: కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ప్రజాగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరభేరి మోగించడానికి ప్రజాగర్జన చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, చిలుక దేవిదాస్, రతన్, అశోక్, జింక సతీశ్, సురేశ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

ఇంద్రవెల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీని బలోపేతం చేయాలన్నారు. జెడ్పీటీసీలు ఆర్క పుష్పలత, కుమ్ర రఘురాం, సిడాం భీంరావ్, దిపక్‌సింగ్‌షెకవత్, మరప రాజు, జైస్వాల్ శివకుమార్, ఆరెల్లి రాజలింగు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మించాలి


మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

ఇచ్చోడ: మండలంలోని షాదీఖానా శిథిలావస్థకు చేరిందని, వెంటనే నూతన షాదీఖానా నిర్మించాలని మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం షాదీఖానా వద్ద మాట్లాడారు. 25 ఏళ్లగా శిథిలావస్థలో ఉండడంతో ముస్లిం, మైనార్టీ వర్గాలకు చెందిన వారు పెళ్లిలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నిర్మానం చేపట్టకుంటే అంబేద్కర్ విగ్రహం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. సమావేశంలో జామతే ఇస్లామీ అధ్యక్షుడు అఫిజ్‌యూసుఫ్, జామ మసీద్ ప్రెసిడెంట్ ఎండీ ముజాహిద్, జామమసీద్ ఇమాం, సయ్యద్ నౌషద్, జావిద్, అబ్దుల్ గఫర్ పాల్గొన్నారు.